# ముత్యాల చెరువు

## ఐ.వి.యస్.అచ్యుతవల్లి

**పుట్టింది పెరిగింది కాకినాడలో. చాలా కాలం వీరి కథగాని, సీరియల్ గాని లేకుండా తెలుగు మాసపత్రికలు వచ్చేవి కావంటే అతిశయోక్తి కాదు. ఆమె తీసుకునే ఇతివృత్తాలు చాలా వినూత్నంగా వుంటాయి. మూగపోయిన ప్రకృతి, అవ్యక్తాలు, బాత్ ఏక్ రాత్‌కీ, మనస్తత్వాలు వీరి కథా సంపుటాలు. ఇదెక్కడి న్యాయం, కొడిగట్టిన దీపాలు వీరి నవలలు. ఇదెక్కడి న్యాయం నవల తెలుగు తమిళ హిందీ భాషలలో సినిమాగా వచ్చింది. సమాజంలోని వ్యక్తులను, సమస్యలను అధ్యయనం చేసిన రచయిత్రి. గృహలక్ష్మి స్వర్ణ కంకణ పురస్కారాన్ని అందుకున్నారు. రెండో తరం రచయిత్రులలో యీమె పేరు ప్రముఖం.**

ప్యాసింజరు దిగుతూనే స్టేషన్ నలుమూలలా కలయ చూసాను. వెంకన్న కాని సూరయ్య కాని వచ్చినట్లు లేదు. బహుశా నేను వస్తున్నానని వ్రాసిన వుత్తరం అంది వుండదు నాన్నగారికి. లేకపోతే బండి యెందుకు పంపరు? కాని నేను కదలటానికి వీలుండదు. పట్టాలు దాటి అవతల సన్న కంకర గుట్టలు దిగి, సన్నని కాలిదారమ్మట నడిస్తే విష్ణుపురం వస్తుంది. అక్కడ జట్కాయైనా రెండెడ్ల బండియైనా కట్టించుకుని మావూరు పోవచ్చును. పెట్టె బెడ్డింగు వున్నాయ్. ఆలోచిస్తూ నిద్రగన్నేరు చెట్టు క్రింద నిలబడ్డాను.

"బండికి సామాను పట్టేదా సిట్టెమ్మా!" అన్నాడు పోర్టరు పోలాయ్.

"నువ్వున్నావుటోయ్! కనపళ్ళేదేం! మావాళ్ళెవరూ వచ్చినట్లు లేదే!" అన్నాను.

"ఉన్నానండీ, 'టీ' తాగి వొద్దామనుకున్నంతలో బండిరాటం పోటం కూడా అయిపోనాది. మీరొక్కరే వచ్చారాండీ! ఇంకెవరూ దిగనేదల్లే వుంది. ఉత్తరం రాపిచ్చలేదుండీ!" అన్నాడు పోలాయ్.

"వ్రాశానోయ్! అందలేదులా వుంది. సరే పద అన్నాను. ఇంతలో ఏదో బండి వస్తున్నది గాబోల్ను, సిగ్నల్ ఇచ్చారు.

"ఉండండమ్మా! ఈ బండి చూసుకోని వస్తాను" అన్నాడు. ఆ బండి రావటం వెళ్ళటం జరిగింది. ఒక్కరూ దిగలేదు.

"ఏం టేసనులే! ఒక్కరూ దిగరూ, ఒక్కరు ఎక్కరు, అదే బెజవాడ అవితే, ఓహ్ ఏం సందడేం సందడీ! ఎక్కేవోరూ, దిగేవోరూ- చేతినిండా పనే! జేబుల్నిండా డబ్బులే" అన్నాడు పోలాయ్, పెట్టె బెడ్డింగ్ నెత్తి కెత్తుకుంటూను.

"అక్కడమట్టుకు పని అంతా నీ కొక్కడికే తగుల్తుందిటోయ్! ఇక్కడనయితే నయం కాదూ! నీకు పోటీయే లేదుకద!"

"ఏం నయమండీ! నాల్రోజులకోపాలన్నా బేరం తగుల్దు!"

"ఇప్పుడు నేను దిగలేదుటోయ్! సరేకాని ఈ "గరుడాచలం" ఇవ్వాళ కదలదేమిటి!" అన్నాను నడుస్తూను.

"అది రేపు మద్దేలదాకా ఈడనే పడుంటది. దాన్నేం వేసుకుపోతదంట!" అన్నాడు. మేమిద్దరమూ గూడ్సు

### ఆణిముత్యాలు

పెట్టెల మధ్యనుంచి దూరి పట్టాలు దాటి నెమ్మదిగా నడుచుకుంటూ విష్ణుపురం జేరేము. విష్ణుపురం స్టేషనుకి షుమారు ఫర్లాంగు దూరం వుంటుంది. బళ్ళ స్టాండు దగ్గర నా సామాను దింపేసి నేనిచ్చిన రూపాయి పుచ్చుకొని వెళ్ళిపోయాడు పోలాయ్. మా వూరికి నాలుగు రూపాయలడిగాడు జట్కావాలా.

"అదేంటోయ్! పోయినసారి రెండు రూపాయలే కదూ! రెట్టుకు రెట్టూ పెంచావేమిటి?" అన్నాను.

"ఏం చేసేదమ్మగోరూ! నాల్రోజులయి ఒకటే వర్షం

## మరణమే.. సుధాగానం

అప్పుడప్పుడూ/నేనెటూ వెళ్ళకుండా వుంటాను
ఆఫీసులోనో / సొంత గదిలోనో
కొండొకచో సొంత మదిలోనో
నేనెటూ వెళ్ళకుండా వుంటాను
వెళ్ళని దారిలో కూడా మరణాలు
నన్ను ఆపాలని చూస్తున్నాయి
లాడ్జీలో బలవంతంగా మరణించిన టీవీ యాంకర్
పాత మగ స్నేహాల్ని వెలికితీసిన వారు..
సర్వీసులో స్వచ్ఛందంగా విరమించిన ఐపీఎస్‌ని
వెనక్కు లాగిన మగమూర్తుల జోలికి పోరు
ఓ బాలికని గల్ఫ్‌ల బారి నుంచి రక్షించిన
ఎయిర్ హోస్టెస్ అమృత
విమానం కెప్టెన్ తిరుపతికి విమానం నడపనన్నాడని
సర్వీస్‌నే నెర్వస్‌లేక త్యజించింది
అసలు మరణాలు మనుషులకేనా?
అనేక వాదాలకి కూడా కదా!
మరణాల్ని మరలుగొనడమే స్వప్నమైన చోట
మరణాల్ని కోరలుగా తొడుక్కోవడమే
అప్పనంగా గెలుపు సోపానాలు
అవుతున్న చోట/నేను వెళ్ళే దారిలోని మరణాలు
నేను వెళ్ళని దారిలోని మరణాలు
విక్రమార్కుని కథలోని బేతాళుడిలా
తెలిసి సమాధానం చెప్పకపోయావో...
నీ తల వేయి ముక్కలవుతుందని
అనడం లేదు
తెలిసీ మద్దతు తెలపకపోయావో
నీ తల నాల్గు ముక్కలవుతుందని గద్దిస్తోంది
గద్దెల్ని ఆశిస్తున్న వాళ్ళంతా
రేపెప్పుడో మరణించవచ్చు
కొందరికి కృతజ్ఞతల్లో
మరణించకుండా కూడా వుండవచ్చు
మరణాల్ని కూడా / జిల్లా టాబ్లాయిడ్ స్థాయిలోకి
దిగజార్చిన చోట / మరణించకుండా వున్నా
మరణించినా / ఒకటే అయిన చోట..
రాజకీయ దేవుడ్ని నేనొక్కటే కోరుతున్నాను
నాకు మరణం లేకుండా చేయమని కాదు
మరణాల్ని తట్టుకునే ధైర్యాన్నివ్వమని

**-కె. ఆంజనేయకుమార్**

పడటం నించి రోడ్లన్నీ గండిలడ్డాయ్! అదేనా ఈ బండి డాముదాకానే పోతది. అక్కడ్నించీ నడుచుకు పోవాల్నా!" అన్నాడు.

"సర్లే! మరేం చేయనూ" అన్నాను జట్కా ఎక్కి కూర్చుంటూ. ఇక్కణ్నించీ మా వూరు డాముదాకా సన్న కంకర రోడ్డు వుంది. డాము దగ్గిర్నించీ వూరుదాకా మట్టిరోడ్డు సుమారు రెండు ఫర్లాంగులుంటుంది. ఆ మట్టిరోడ్డు రేగడి బెడ్డలవటం నించీ ఏ మాత్రం వర్షం కురిసినా మెత్తబడిపోయి దిగబడిపోతూ వుంటుంది. ఎండకి ఎండిపోయినప్పుడు ఆ మట్టి అంతా పశువుల తొక్కిడి మూలంగా గట్టిపడిపోయి గతుకులు గతుకులుగా వుంటుంది. ఆ గతుకుల రోడ్డు మీద గుర్రంబండైనాసరే కుదుపుతూ ఇంటికి వెళ్ళేసరికి, వళ్ళంతా ముద్దయిపోయి మూడు రోజులదాకా మామూలు మనిషి కావటానికి సావకాశం వుండకపోతుంది. నాలుగు రోజుల ఏకవర్షానంతరపు ఎండేమో, ఆ కొత్తగా మబ్బు విడిచిన ఎండ చితచిత లాడిస్తోంది. బండి డాము సమీపించింది. ముందు దారి అంతా బంద బందగా కనుపిస్తోంది. నేను జట్కాదిగా. వాడు గుర్రాన్ని విప్పి ప్రక్కనున్న తుమ్మచెట్టుకి కట్టేసి, అడుగున వలలో వున్న పచ్చగడ్డిని దాని ముందు పడేసి నా పెట్టె, బెడ్డింగు నెత్తికెత్తు కున్నాడు. వాడు ముందుర నడుస్తోంటే, వాడు వేసిన అడుగులోనే నేనుకూడా అడుగువేస్తూ నడుస్తున్నాను. ఇంకా వూరు కనుచూపు దూరంలో వుండగానే నా దృష్టి వూరి పొలిమేరనున్న మా చెరువుమీద పడింది. చెరువు నిండుగా ఎన్నెన్నో తామరాకులూ, తామరాకుల నిండా వర్షపు తుంపర్ల వల్ల కలిగిన నీటికణాలు ఆ ఎండలో తళ్కు తళ్కుమంటూ దేవతలు ఆకాశం మీంచి మంచి ముత్యాలు కురిపించేరా అన్న భ్రాంతిని కలిగిస్తోంది. నల్లని, సన్నని పొడుగాటి కాళ్ళతో నీటికొంగలు ఆ ఆకునుంచి ఈ ఆకుమీదికీ, ఈ ఆకు మీదనించి ఆ ఆకుమీదికీ తేలిపోతూ నడుస్తూ తమ పొడుగాటి మెడని చాచి, తమ ముక్కులతో నాచులోకి పొడుస్తూ దొరికిన పురుగుల్ని తింటున్నాయి. తెల్లగా అరవిరిసిన తామరపూలు జన్మకారకమైన జలతరంగాల చల్లదనంకన్న, తమ బాహువుల కందని ప్రియ బంధువు యొక్క వెచ్చదనమే తమకి ఎక్కువ సౌఖ్యకారకమైనట్లుగా తమ మనసుల్లోని అనురాగాల స్వచ్ఛతనంతా, తమ ధవళరేకల వొంపుల్లో నింపు కుంటూ, నీలాకాశంలోని తీక్ష్ణ ప్రతాపునివంక ఆహ్వాన

పురస్కరంగా అరమోడ్పు కన్నులతో చూస్తున్నవా అన్నట్లు అలల మీద చిరుగాలికి తలలూపుతూ నిలచివున్నయి. నేను గబగబ నడిచి, చెరువును నాకరువుతీరా చూసి కాళ్ళూ, చేతులూ, ముఖమూ కడుగుకొని మా ఇంటికి వెళ్లాను. ఇంటిలో నాక్కావల్సిన వాళ్ళందరూ చుట్టూచేరి కుశల ప్రశ్నలు అడుగుతూ గొడవచేయటం మొదలెట్టారు. కాని, నాకేదో వెలితిగా అన్పించింది. ఫలానా అని చెప్పలేని మూగబాధ నా గుండెల్ని పిండసాగింది. కాస్సేపటికి మా నాన్నగారు పొలంనించి వొచ్చారు.

"జట్కా వేసుకు వచ్చావామ్మా! ఉత్తరం అందింది. కాని, ఏం చెయ్యను? పాలేళ్ళకి ఎక్కడా ఖాళీలేదు. ఈ వర్షాలనించి దాళవా కుప్పలన్నీ నాశనమయి పోయాయి. అటుచూస్తే ఏ పనికైనా కుడిభుజంలా పనిచేసే ఆదెయ్య మతిబోయి తిరుగుతున్నాడు" అన్నారు.

"ఆదెయ్యకి ఆరోగ్యం బాగాలేదా నాన్నా?"

"ఏం బాగు తల్లీ! ఆ ముత్తి పోయిందగ్గర్నించీ వాడికి మతే లేదు. ఇవ్వాళో రేపో అన్నట్లున్నాడు. నీకు చెరువుకట్ట మీద కనపళ్ళేదా?" నిర్ఘాంతపోయాను. కారణం తెలియకుండానే కడుపులో మెలిదిరుగుతున్న అవ్యక్త బాధ వ్యక్తమయ్యింది.

"ముత్తి చచ్చిపోయిందా? ఎల్లా చచ్చిపోయింది నాన్నా? ఎప్పుడు చచ్చిపోయింది?"

"ఆర్నెల్లవ్వొస్తోంది. పాపం..."

"ఆర్నెల్లయిందన్నమాట. నాకు ఉత్తరమేనా వ్రాశారుకాదేం? అవును, ఎందుకు వ్రాస్తారు? వాళ్ళ దృష్టిలో ఒక పాలేరు కూతురు చనిపోవటం సర్వ సామాన్య విషయం. నా దృష్టిలో దానికి విలువకట్టలేని సంఘటన. జీవితంలో ఒక ఆప్తమిత్రురాల్ని, నేను పుట్టినది మొదలు ఇప్పటివరకూ నాకు ఎవ్వరూ ఇవ్వలేనంత మానసికానందాన్ని ప్రసాదించిన స్నేహశీలిని నేను ఎల్లా మరచిపోతాను? ఒక వ్యక్తి జన్మించటం అందరికీ ఆహ్లాదకరం కానట్లే, మరొక వ్యక్తి మరణించటం అందరికీ దుఃఖకారణం కాదు. జనన మరణ, సుఖదుఃఖాలు అనేవాటిని ఎవళ్ళ బంధు పరిధుల్లో వాళ్ళే అనుభూతిని జెందుతారు. నా గదిలో కెళ్ళి మౌనంగా కూర్చున్నాను. ముత్యాలు! మంచి ముత్యాలు! తన స్నిగ్ధ స్నేహవల్లరులతో నా మనస్సుని బంధించిన ముత్యాలు. అప్పుడే నూరేళ్ళు నిండాయా? నాతో ఒక్క మాటా చెప్పకుండా ఎందుకని పోయావు?

## వెన్నెల శికారం

అటు వెన్నెల.. ఇటు వెన్నెల...
నేల నలుచెరుగులా పరుచుకొన్న సిరివెన్నెల...
శరత్కాలంలో హాయిని గొల్పే
పండు వెన్నెల్లో చెట్టాపట్టాలేసుకొని
జీవన సహచరితో విహరిస్తుంటే
మదిలో భావ కవిత్వం జాలువారుతోంది!
వెన్నెల వర్షంలో ప్రకృతి తడిసి
ముద్దయి వణుకుతోంటే/ప్రశాంతతను కురిపించే
నిర్మల నీరవ సౌందర్యాన్ని చూసి
మనసు అలౌకిక ఆనందంతో ఊరడిల్లుతోంది
కలల వెన్నెల అలలపై తేలుతూ
ఊయలలూగుతున్న వలపు కలువల రేకులు
అలవోకగా విప్పారుతుంటే
హృదయ కవాటాల నుండి అమృతం
వడివడిగా ప్రవహిస్తూ ఉత్తేజాన్ని
తనువులోని అణువణువునిండా మెత్తగా నింపుతుంటే
సుందర స్వప్నాల స్వర్గపు పై అంతస్తులలో
షికార్లు చేస్తున్నట్లనిపిస్తోంది!
ఆమె సిగలోని మల్లెలపై పడి పరావర్తనమయ్యే
వెన్నెల కిరణాలు నా హృదయపు అట్టడుగు పొరల్లో
శోషణమై అపురూప భావాల్ని నిక్షిప్తం చేస్తున్నాయి!
ఆమె ఎర్రని పెదవుల మీది చిరునవ్వుల పువ్వులు
వెన్నెలతో పోటీపడి మెరిసిపోతూ
తళుకులీనుతుంటే ఎద లోతుల్లో
అపూర్వ భావ విప్లవం విస్ఫోటం చెంది
ఎగిసిపడే అవ్యక్త మధురానుభూతులు
ఉదాత్తతను ఆపాదించుకొంటుంటే అంతరంగంలో
ఆవిష్కరించబడిన కరుణామయ దృశ్యాలు
రెక్కలొచ్చి కవితా విహంగాలుగా ఎగురుతున్నాయి!
మమతల పందిళ్ళకు అనురాగ బంధాలు
చిక్కగా అల్లుకపోతుంటే మస్తిష్కంలో
ఆలోచనా పరిమళ జలపాతాలు
ఉద్విగ్న శిఖరాల నుండి దూకుతుంటే
ఎద లోయల్లో ప్రవహించే సెలయేళ్ళల్లో
అనుభవాల లేళ్ళు చెంగు చెంగున గంతులేస్తున్నాయి
మా ఇద్దరి గుండెల్లో ఒకే పరవశత్వం!
ఒకే ప్రేమతత్త్వం...!
వెన్నెల మైదానాల్లో పై పొరల్ని చీల్చుకొంటూ
అంకురిస్తున్న భావావేశాల బీజాలు
రూపుదాల్చిన వనాలలో బతుకు పండించుకొంటాము!

-గోపాలుని వెంకటేశ్వర్లు

నన్నెవరితో కబుర్లు చెప్పుకోమంటావు? నాకొచ్చే పిచ్చి సందేహాలకి జవాబు లింకెవరు చెప్తారు?

"చిట్టీ! అల్లానే కూర్చుండిపోయావేం? స్నానంచేసి బట్టలు మార్చుకోమ్మా" అన్నది వదిన.

"ముత్యాలకేం జబ్బు చేసిందమ్మా, వొదినా?"

"జబ్బాలేదు, పాడులేదు. చెరువులో పడి

## కాకి

జ్ఞానం అజ్ఞానం కన్నా హీనంగా
బురదలో పొర్లాడుతున్నపుడు
కిరీటం స్వార్థాగ్నిలో కరిగి కరిగి
మురుగులో కలిసిపోతున్నపుడు
విసిగిన నాగళ్లు వేటకత్తులై
రోడ్లను నరుకుతున్నపుడు
భోగలాలస చిత్ర వైరుధ్య
నృత్య విన్యాసాలు చూపుతున్నపుడు
ఎండిన మోడుపై కూర్చున్న ఒక కాకి
ఇట్లా అరుస్తున్నది
మనిషీ! నీ సహచరుడను నేను
ఆది మధ్యాంతాలలో
నిన్ను అల్లుకునే వున్నాను
నీ గత పతన వుత్థానాలకు
నీ అనంతానంత చరిత్రకు
నిరంతర సాక్షి నేను
'ఛీ కాకీ! ఛో' అన్నావు
నాడు నేడు రేపు నేను 'కాకి'నే
మరి నువ్వో...
ఆటవికుడివి కిరాతకుడివి రాక్షసుడివి
మనిషివి దెయ్యానివి దేవుడవు
ముష్కర తస్కరుడవు హంతకుడవు
ఈర్ష్య ద్వేష అసూయల జ్వాలాముఖుడవు.
నేటికీ 'మనిషి' కాలేని వ్యర్థ ప్రాణివి
పాలు తాగిన రొమ్మునే కసిగా పిసికేవాడివి
అందుకే నీ చిరునామా చెరిగిపోతుంది
నువ్వెప్పుడూ గత శిలాజానివే
నేను 'కాకి'గానే వుంటాను
నీ పిండం తినడం కోసం
నువ్వు...
నన్ను పిలుస్తూనే వుంటావు

—మునిసుందరం

చనిపోయింది."

కిటికీలోంచి చెరువుకేసి చూసాను. తామరపూలన్నీ కలకల్లాడుతూ నన్ను చూసి నవ్వుతున్నాయి.

"చెర్లోపడి ఎల్లా చచ్చిపోయిందొదినా! దానికి ఈదటం వచ్చునే!"

"అయ్యో వెర్రిపిల్లా! చావాలని పడినది ఈదుకుని గట్టుమీదకు వస్తుందా! రామ్మా! స్నానంచేసి బట్టలు మార్చుకుందువు కాని"

నాకు ఏ పని చేసుకోబుద్ధవటంలేదు. నా శరీరమూ మనసూ కూడ అచేతనమౌతోంది. నా అంతస్సు గతించిన సుందర స్వప్నాల జాలంలోకి జారిపోతోంది. నేను చెదిరిన మనస్సుని కూడతీసు కుందుకు ప్రయత్నించటంలేదు. ఆ శకలాల్ని అల్లానే పరిభ్రమించనిస్తున్నాను.

'సిట్టీ!'

నా అంతరంగంలో తొలిసారిగా పిల్చిన ముత్యాలు గొంతు సన్నగా విన్పించింది. నేను వెనక్కి తిరిగి చూసాను.

"నిన్నో పాలి ముట్టుకోనిద్దూ! ఏం?" నా కళ్ళల్లోకి దీనంగా చూసింది ముత్తి. అది నాకు గజం దూరంలో నించుని వుంది. దేవతా విగ్రహం ముందు భక్తురాలిగా నిలబడింది అది.

"ఇల్లా వచ్చి కూర్చో!" అన్నాను. అక్కడ్నే కూర్చోంది. నెమ్మదిగా చేయి చాచి నా చేతికున్న గాజుల్ని తడిమింది.

"ఇల్లా ప్రక్కన కూర్చోమంటే అంతదూరంగా కూర్చున్నావేం?"

"వోరన్న సూత్తారు"

"చూస్తే!"

"ఏం నేరనట్టు మాటాడుతావే! చూత్తే ఇంకేమన్న వుందా! ఇద్దర్నీ నిలేసి తంతారు పెద్దోళ్ళు!" నవ్వింది. ఆ నవ్వు చంద్రవంకలా కన్పించింది నాకు. చెరువు గట్టుమీద కూర్చున్నదాన్ని కాళ్ళు నీళ్ళల్లో జారేశాను. కాళ్ళకేదో చుట్టుకుంది. దబుక్కున కాలు పైకి లాగుకున్నాను. సన్నగా పొట్లకాయలా నల్లగా చారలు చారలుగా వున్న పాము నీళ్ళల్లో ఈదుకుంటూ పోయింది.

"అమ్మో! పాము. నిష్కారణంగా చచ్చిపోదును" అన్నాను భయంగా.

"అవ్వేం చేస్తయ్ బురదకట్టెలు! ఆట్ని సంపుతె బోలెడు పాపంట. అవి ముందుజన్మలో ఋశులంట."

"అవేంపూలు ముత్తీ!" అన్నాను. చెరువుగట్ల వారమ్మటే, సన్నటికాడకి అరకు చుక్కల్లాంటి ఆకులున్నాయి. వాట్లకి పూదారంగులో అరచేయియంత పూవులున్నాయి.

"తెలవ్వా! తూటుపూలు అయ్యి?"

"ఆ గడ్డి అంతా తుంగేనా?"

"తుంగెందుకవుద్ది, అల్లిగడ్డి!" నా పాదాల్ని నెమ్మదిగా ముట్టుకొని, మళ్ళీ కణకణలాడే నిప్పుల్ని ముట్టుకున్నంత త్వరగా చేయితీసుకొంది.

"ఎందుకంత భయం" నవ్వాను.

"ఏంలేదు"

''ఇక్కడ వల్లెటూరవటంనించి ఇట్లాంటి పిచ్చిలున్నాయి. కాని, అదే మా బస్తీలో ఇల్లాంటివేం లేవు తెలుసా? నీలాంటివాళ్ళంతా మా ప్రక్కనే కూర్చుంటారు. మేమంతా కలిసిమెలిసి వుంటాం. నాతో చదువుకుందుకు, ఆడుకుందుకు మా ఇంటికి వస్తారు. మేమంతా ఒక గదిలోనే కూర్చుంటాం. మరి మా పెదనాన్నగారు ఏమీ అనరు. తెలుసా!"

"ఆళ్ళంతా అదురుట్టమంతులు! మా సినబావ కొడుకు బత్తీలో సదువుతున్నాడు గదా! ఆడి సావాసపోళ్ళు బామ్మర్లే. మనూరు సూటాన్నికొచ్చేరు. మరిగంటే నేను కాపీ కాచిస్తే తాగేసినారు కూడ ఆళ్ళు." ఎంతో ఆనందంగా చెప్పింది.

చెరువు మీదకు వ్రాలివున్న ఈతమట్టల చివర్ల ఎన్నెన్నో పిచ్చికగూళ్ళు వున్నయ్. ఎండవేళ పిచ్చికలు లేవుకాబోల్ను, కాకులు ఆ గూళ్ళల్లో ముక్కులతో పొడిచి ఆ పిల్లల్ని తింటున్నాయి. ఆ బాధకి ఆ పిల్లలు కిచకిచమంటున్నయి.

"హోహ్! ఏం సొద! మీ జిమ్మడ!" లేచి నుంచుని రాళ్ళుచ్చుకుని కొట్టేసింది ఆ కాకుల్ని ముత్తి.

నేను చెరువు నిండుకూ వున్న తామరపూలని చూస్తూ కూర్చున్నాను.

"సిట్టీ! మీ బత్తీలో బయస్కోపు లుంటవిగదా! మరిగంటే నువు రోజూ సూత్తావా?"

"రోజూ చూస్తే చదువో! ఎప్పుడయినా మంచి పిక్చరు వొచ్చినప్పుడు చూస్తాను."

"మంచియ్యంటే, అయ్యి పంచరంగుల్లో వుంటయి అయ్యేనా?"

'ఊ' అన్నాను. అంతకన్నా వివరంగా ఎల్లా చెప్పాలో నాకు తెలీలేదు.

"అప్పుడే వెల్లిపోతవా?"

"కాఫీ వేళయింది కదూ!"

"రేపు వొత్తవా?"

"రోజూ వొస్తున్నాను. నువ్వు మాత్రం కన్పడడం ఇదే మొదటిసారి."

"అవును రెండారాల కింద పెద్దమ్మ సెప్పింది. అమ్మాయిగారొత్తారని."

''నువ్వు మా ఇంటికి వచ్చావా? నాకు కనపళ్ళేదేం?"

"రాకేం! మొన్నోపాలి 'పులవల బత్తా' బాగుచేయటానికి వచ్చాము. నేనూ సురయ్య పెళ్ళాము. ఆయేల నువ్వు సావిట్లో కొచ్చినట్లే వొచ్చి మళ్ళీ గదిలోకి పోయినావు. 'మెరుపు తీగలాగుంది సిట్టెమ్మ'- అన్నది సూరయ్య పెళ్ళాం."

"ఉహు, అల్లాగా!"

"అప్పట్నించీ నీతో మాట్లాడాలని ఒకటే మణుసు నాకు." నేను దాని భుజం మీద చేయివేసి 'పద పోదాం! నేను రోజూ వొస్తాను, నువ్వు కూడా రోజూ రా! ఏం' అన్నాను. ముత్యాలు నాకేసి చూస్తూ నించుండి పోయింది. కాస్సేపటికి తమాయించుకుని దాని భుజంమీది నా చేయి తన చేతుల్లో పుచ్చుకుని కాసేపు

## ఊహాలోకం

**గా**లిలేకుండా నీరు లేకుండా
శ్రమలేకుండా ఏ పరిశ్రమ చేయకుండా
వాస్తవానికి అతీతముగా
మనసుకందని భ్రమలో
మారాము చేస్తున్న భావనలతో
ఎడద ఎనుగుపై నెక్కి
ఎండమావుల మెండు తలపుల
ఎడారిలో ఎంత దూరమైన తిరిగి రాగలము
తీయనైన దానిని సృష్టిస్తూ
మమతానుబంధాలను పెంచుతూ
అద్భుతాలను ఆస్వాదిస్తూ ఆనందించగలము
ప్రకృతి అందాలను స్పృశిస్తూ
పై లోకంలో విహరిస్తూ
ఊహలను పల్లకీలో ఊరేగిస్తూ
మనసు రెక్కల గుఱ్ఱంపై ఎక్కి
ఎక్కడికో- ఎక్కడెక్కడికో పయనించేదే
ఊహాలోకం- అదే మన ఊహలకందని లోకం!!

**-శివాజీ పట్నాయక్**

## ఉపాధ్యాయులు!

అక్షరదాతలు వీళ్ళు! / భవితకు రక్షణనిచ్చేవాళ్ళు!
బాలల భవితకు వీరే పునాదిరాళ్ళు!
భావి పౌరులందరికీ వీరే ఆనవాళ్ళు!
నాటి సర్వేపల్లి రాధాకృష్ణన్!
మొన్నటి జవహర్‌లాల్ నెహ్రూ!
నిన్నటి మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ!
నేటి బాబాసాహెబ్ అంబేద్కర్!
మరి ఇప్పటి పుచ్చలపల్లి సుందరయ్య!
ఇంకా శంకరంబాడి సుందరాచారి
పింగళి వెంకయ్య ఆంధ్ర కేసరి
గురజాడ రాయప్రోలు ఇలా ఇలా ఇలా
ఎందరో ఇంకెందరో మరెందరి/ప్రగతికి వీరే నకళ్ళు!
విద్యాలయాల్ని దేవాలయాలుగా చేసి
భగవంతుని రూపంలో భక్తికి ప్రసాదంగా
చదువును పంచేవాళ్ళు!
చదువులమ్మ ముద్దుబిడ్డలు వీళ్ళు!
నేటి భారతికి ముద్దుబిడ్డలు!
వీరే జాతికి భవితను పంచిచ్చే నిలువుటద్దాలు!
ధరిత్రి ఉన్నంతవరకూ ఎన్నటికీ తరగని చెరగని
ప్రగతిని సాధించె ధరిత్రి కన్న ముద్దుబిడ్డలు!
చరితకు ఆదిగురువులు వీరే ఉపాధ్యాయులు!

## సమైక్యతా నాదంతో!

సింగరేణి గనుల్లో / సీలేరు ప్రాజెక్టులో
బ్రహ్మణి స్టీల్స్‌లో / దగాపడ్డ బ్రతుకుల్లో
పోచంపల్లి ప్రాజెక్టులో / పోలవరం డామ్‌లో
జరిగే ప్రతిస్కాముల్లో / ఘర్మ జలానికి
కర్మ ఫలానికీ / వెలకట్టలేని జగంలో
నేత కార్మికుల బ్రతుకుల్లో
ప్రత్తి రైతులు ఆత్మహత్యల్లో/విరించిలా! విపంచిలా!
విస్ఫోటనంలా! చెలరేగుతూ/ముందుకు దూకుతూ!
మునుముందుకు సాగండి మీరంతా
గతం మరచి బ్రతుకు తెలిసి
మొక్కవోని ధైర్యంతో ముందుకు మునుముందుకు
మరో ప్రపంచం పిలిచిందని నినదిస్తూ!
అహరహమూ శ్రమిస్తూ! కడదాకా కలిసొస్తూ!
పదండి ముందుకు! పదండి తోసుకు!
ప్రతి మనిషీ సమంగా సగంగా
బ్రతకగలిగే నాకం వైపుకు/ అభ్యుదయ భావంతో!
సమైక్యతా నాదంతో!

-దోసపాటి సత్యనారాయణమూర్తి

అల్లానే పట్టుకుని వదిలేసింది. అప్పుడు వచ్చేటప్పుడు ఒక పాత సిల్కు చీర ఇచ్చి వచ్చాను. ఎంతో సంబర పడింది.

మళ్ళీ సంవత్సరం.

ఊడ్పులు మొదలయినాయ్! ముత్యాలు కెక్కడా తీరుబాటు లేదుకాబోల్సు- కనిపించటంలేదు. నేనొక్కర్తినే నా స్థానంలో కూర్చున్నాను.

"ఎప్పుడొచ్చావ్ సిట్టీ?"

వెనక్కి తిరిగి చూశాను.

"నేనొచ్చి పదిహేను రోజులవుతున్నదిలే! ఎక్కడా దర్శనాలు లేవే తమరివి?"

"ఊడ్పులకి గూడెమెల్లాం. నిన్న సాయంత్రమే వొస్తా!" నా ప్రక్కనే కొంచెం దూరంలో కూర్చుంది.

"మనూరిలో పని లేదా?"

"ఎందుకు నేదు! ఇక్కడంటే కూలి తక్కువ సిట్టీ! గూడెంలో మదుసులు తక్కువ. రొండు రూపాలు ఇత్తన్నారు. ఈ పదిరోజులూ పొయ్యిలోకీ, కడుపులోకీ ఇచ్చి, రెండు రూపాలూ ఇచ్చీరు."

"ఈ వారం రోజులుగా ఒకటే వర్షంగా! మీరెలా పనిచేశారు?" ఆశ్చర్యపోయాను.

"బలేదానివే? వోన లేకపోతే ఎక్కడూడ్వమంటావ్? ఆ వోనదేముడు సల్లంగా సూత్తేనేకందా, మన కడుపులోకి బువ్వ వచ్చేది? ఇంత సదివావ్ ఈ మాత్రం తెల్దేటి?" పకపకా నవ్వింది.

నేను దానికేసి చూసాను. దృఢంగా ఆరోగ్య వంతంగా వుంది. కాలి వ్రేలి మొదలు, నుదురు దాకా నల్లగా నిగనిగలాడుతూ మెరుస్తూనే వుంది. పదిరోజుల నిరంతర శ్రమవల్ల కలిగే ఆయాసం కించిత్తూ స్ఫురించలేదు నాకు. పది రోజులుగా మోకాలి లోతు బురదలో, పైన సన్నటి వర్షపు జల్లుల్లో తడుస్తూ పని చేసిన మనిషల్లె లేదు. అయిదారుగురు పరిచారికలు కనిపెట్టుకుని వుండి, మెత్తని ముఖమల్ తివాసీల మీద కాని అడుగు వేయించని రాజకుమారి మృదుత్వంతో వున్నది. కొంచెం వర్షంలో తడిస్తే జలుబు చేస్తుంది నాకు. తల భారం, జ్వరం, వెలిపొచ్చేస్తుంది. కొంచెం చెరువులో కాళ్లాడించుకుంటే చాల్సు, కాలి వ్రేళ్ల మధ్యనున్న చర్మం పలుచబడి పొరిసి మంటలు పుడ్తుంది. నేనదే అన్నాను ముత్యాలుతో-

"ఒసే మీరు రోజల్లా అల్లా తడిస్తే రోగాలు రావూ!"

"రోగాలెందుకు వస్తయ్యి! ఆకాశరాజూ భూదేవి మాలచ్చీ మమ్మల్ని దీవించరేంటి? అయినా ఈ

పనులున్నన్నాళ్లూ మేం పొడన్నాలు తింటాంగందా?"

"పొడన్నమంటే?"

"వార్పు అంతా ఓ గిన్నెలో ఒగ్గేసి, కడుపు పట్టినంతా, వొంగ్రనంజుకోని మామూలు అన్నమే తినేస్తాం! బలం వుండక ఏమవుద్ది?" 'అన్నం తింటాం' అని గర్వంగా చెప్తోంటే ఆశ్చర్యపోయాను.

"మరి రోజూ తినరేం" అన్నాను.

"పాటు' లేనప్పుడు ఎక్కణ్నించి వస్తయ్ గిన్నెలకి గిన్నెలు గింజలు? ఇప్పుడు అయితే పనిచేయించు కుండే వోళ్ళు ఇవ్వాల గింజలు. వండుకోటానికి కంపా కర్రా పడేత్తారు. దరిజాగా తినేత్తాం. రోజూ రమ్మంటే ఎల్లా వస్తయ్? పనిలేకుండా గింజలిచ్చే దరమదేవత లెవరుంటారు. సిట్టీ!"

"మరి గింజలు లేనప్పుడేం చేస్తారు?"

"చోళ్లో, కొర్రలో, నూకలో... ఏయి చవగ్గా దొరికితే అయ్యి కొనుక్కోని జావలా కాచుకోని త్రాగుతాం. రెడ్డిసీమోళ్ళకి జొన్నలు చవగ్గా దొరుకుతయి. అయి పిండి ఇసరుకొని రొట్టెలేసుకుంటారు. అన్నమయితే గడ్డినాగవుతుంది" అంది.

నాకు ఆరోజు అన్నం సయించలేదు. నేను తిని మాత్రం ఏం లాభం?

రెండు పూటలా కమ్మని పెరుగుతో భోజనం, రెండు పూటలా ఏదో వక పానీయం కాకుండా ఫలహారాలు. జావ నీళ్ళతో బ్రతుకుతున్న ముత్యాలు చేసే పనిలో ఎన్నోవంతు చేస్తాను? ఆరువీశల కారం అవలీలగా దంచిపెడ్తుంది ముత్యాలు. అరసోలకారం దంచుకుంటే చేతులు మంటలుపుడ్తాయ్! నేను తినే తిండి ముత్యాలుకి లభిస్తే ఇంకా ఎంతపని చేస్తుందో! ఆహారం ఎక్కువయి ఆయాసం మాకయితే, సరయిన పోషక పదార్థాలు కొనుక్కోలేని ఆర్థిక అసమర్థత వల్ల నీరసించి పోతున్నారు వాళ్ళు. నా అన్నానికి సరిపడ్డ ధాన్యం నేను నేలదున్నుకొని, వూడ్చుకొని పండించుకోలేను నేను. వాళ్ళు వాళ్ళ అన్నానికే కాకుండా, కొన్ని వేల మంది పొట్టలూ, పెట్టెలూ నిండటం కోసం, వాళ్ల పొట్టల్ని చిలక్కొయ్యలకి వేలాడేసి శ్రమిస్తున్నారు. వాళ్లకన్నా నేనెక్కువదాన్ని ఎల్లా అవుతాను?

"వొత్తాను సిట్టీ! మరిగంటె నేను వూడ్పుకి గూడేనికి పోయినానని మీ నాన్నోరికి కోపంగా వుంది. కాస్త నువ్వు సదరాలి."

"చెప్తాలే! అయినా నువ్వు వూడ్పులకి వెళ్ళితే

## చిన్ని గాయాలు

మిక్సీలు, గ్రైండర్లూ
ఏసీలు, టీవీలు
వాక్యూం క్లీనర్లు
వాషింగ్ మెషీన్లూ
రాను రాను భామలంతా
బ్రాయిలర్ కోళ్ళే
  గంగమ్మ జాతర
  కొయ్యండి కోళ్ళు
  నరకండి పొట్టేళ్ళు
  నిత్య నైవేద్యం లేదుగా
  ఆకలి మీదుంది
పోలేరమ్మకు, పోతరాజులకు
రక్షణెందుకు?
గరీబులు - గ్రామదేవతలు
పద్మావతులు, శ్రీనివాసుళ్ళకు
రక్షణ కావాలి.
అమీరులు - నగర దేవతలు
ఎక్కడా తేడాలే!
  భూమాతకు / గడ్డిపూల వస్త్రం
  పూబాలకు / గాలి భర్త
దిగంబరస్వాములు
యజ్ఞం చేస్తే దైవకార్యం
చూసేవాళ్ళు భక్తులు
క్లబ్బుల్లో, పబ్బుల్లో
జాతర్లలో, తిరుణాళ్ళల్లో
అర్ధనగ్న నృత్యాలు చేస్తే
న్యూసెన్సు కేసులు
చూసేవాళ్ళు దోషులు
  మంత్రిత్వాలకు మైనారిటీలంటే
  కుర్చీ పోయేంత మహా భయం
  అందుకే, 'హజ్'యాత్రకు
  ప్రభుత్వ సొమ్మిస్తారు
ఒకప్పుడు / మనుషుల్ని చంపింది
'గెలుపు' మంత్రం
ఇప్పుడు
మనుషుల్ని చంపుతుంది
'మతం' మంత్రం

–అయినాల కనకరత్నాచారి

ఆయన కెందుకు మధ్యని?"

"నీకేం తెల్దు సిట్టీ! మా బాబు మీ కమతంలో పాలికున్నాడు గందా! అందుగురించి ఆడివోళ్ళంతా మీ కమతం పూడ్పులోకి రావల్సుంటది."

"అయితే మరెందుకు రాలేదు?"

"ఏం చేయను సిట్టీ! నాన్నగారు పదణాలు, ముప్పావులా ఇత్తన్నారు. గూడేన్ని రూపాన్నరా రొండూ ఇత్తన్నారు. ఇక్కడ మదుసులెక్కువ, పని తక్కువ. అక్కడ పనెక్కువ, మదుసులు తక్కువ. దాంతో కూల్డబ్బులు నాలుగెక్కువిత్తన్నారు."

"అవును మరి, మీకెక్కడ నాలుగు డబ్బులెక్కువ

## కాలుష్యం కోరల్లో...

తెరపడింది అనుభూతుల హృదయాలకి
పొర ఏర్పడింది కళాత్మక దృష్టికి
పట్టింది జబ్బు మంచి మానవతకు
అంటింది కులమతాల జబ్బు మనసులకు
ఒకరినొకరు నరుక్కుంటున్నారు రాజకీయోన్మాధులై
తెలియని రాక్షసత్వం బ్రతుకుల్ని బలికోరుతోంది
ఎర్రని కళ్ళకు రక్తదాహం
అమాయిక బ్రతుకులు నరకం!
మంచులా కరగిపోతోంది మంచి మనసుల్లోంచి
చిక్కని చీకటిలా మూఢత్వం ముదిరిపోతోంది
అంతరించిపోతున్నాయి ప్రకృతి అందాలు
బీడులైపోతున్నాయి పచ్చని అడవులు!
వన్యమృగాలు వసించుచోటు లేక
పట్టణాలలో దారులు వెతుక్కుంటున్నాయి
ప్రాణాలను కోల్పోవుచున్న పక్షులు
విలవిలలాడుతూ కూలతున్న వృక్షాలు
వికసించకనే వాడిపోతున్న పూలవనాలు
పృథ్విపై పెరిగే వేడి మానవాళిని ముంచనుంది!
జలకాలుష్యం వాయు కాలుష్యం
శబ్దకాలుష్యం ఆహార కాలుష్యం
మరింత ప్రమాదం మనిషిలో స్వార్థమనే కాలుష్యం!
కల్తీలేని సరుకే కొఱతయింది
'స్వచ్ఛతకు' స్థానంలేక శోకతప్తమవుతోంది
తనకు తానే పెట్టుకుంటున్నాడు మనిషి చితి
మానవత మరచి మనిషి నేడు తప్పి ఉన్నాడు మతి!

-మల్లెమొగ్గల గోపాలరావు

దొరికితే అక్కడే పనిజేస్తారు. దానికి కూడా మా ఆజ్ఞేనా?"

"మేమున్నాంగా మీచేలో వొంగాల్సినోళ్ళం. డబ్బులెక్కువ అని ఆశపడి అట్టాపోయినాను. ఇప్పుడు మీ నాన్నగారికి కోపం వచ్చి మా బాబుని పనిలోంచి తీస్తనన్నారు. కొత్తసాలులో రెండు నెల్లాయి జేత్తన్నాడు. పూడ్పులూ అవ్వొస్తున్నాయి. ఇప్పుడాడ్ని పనిలో కెవురు పెట్టుకుంటారు?"

"మీకు ఇప్పటికొచ్చే గింజలు తీసుకొని, ఇంకోళ్ళ కమతంలో జేరకూడదా?"

"మద్దెలో వోరెట్టుకుంటారు? దమ్ములు జేయక మునుపే కాగితాలు రాసుకుంటారుగా! అందులో పని పూర్తికాకుండా మానిపించినోణ్ణి అసలెట్టుకోరు. మేము ఈ సాలంతా తిండి లేకుండా మాడిపోవాలి."

"చెప్తాలే" అన్నాను.

"నీకు తెలియదు లేమ్మ, తండ్రి తండ్రే! కూతురు కూతురే! ఉత్త దొంగ వెధవలు. వీడు మొన్న వడ్లు మరెట్టించుకొని తవుడు అంతా మనకియ్యకుండా అమ్ముకున్నాడు. ఆ ముత్తి ఏమో దొంగముండ, మనకి రాకుండా గూడేనికి పోయింది. నా సొమ్ముతింటూ వూళ్ళు ఏలమన్నా వీళ్ళని 'పాలె'కి పెట్టుకుంటా!"

"ఈసారికి క్షమించండి నాన్నగారూ. పాపం, ఏటికేడాదీ తిండి లేకుండా చేసినవాళ్ళమవుతాం"

"నా తల్లి, నా తల్లి, బంగారు తల్లి, నీ కడుపు నిండాలమ్మ. నీ పాదాలకు మొక్కుతా" అన్నాడు ఆదెయ్య.

"ఏదో బుద్ధి గడ్డితిన్నది బాబులూ. మేం తవుడు అమ్ముకోనేదు బాబయ్యా. కోళ్ళకి ఏసుకుందుకని ఇంట్లో అట్టే పెట్టుకున్నాం. ఎవళ్ళ కొచ్చిందో తెగులు. గుడ్లు పెట్టనానికొచ్చిన రెండు కోళ్ళనీ ఏసుకపోయారు బాబయ్యా. మీ పశువుల నోట్లో మట్టికొట్టాలని చూస్తే మాకు కలిసివత్తదా" అన్నది ముత్తి.

"నువ్వు కోళ్ళని పెంచుతున్నావా?"

"లేదు సిట్టీ! మొన్న ఆరు రూపాలెట్టి 'పరూ' కొచ్చిన పెట్టెల్ని కొన్నాను. ఎవరో నూక్కుపోనారు. ఆళ్ళ జిమ్మడ. పోన్లే ఏం చేత్తాం! నేను కట్టపడలేదు అనుకుంటా. నా కచ్చిరాలేదండీ ఆ పెట్టలు."

"పోన్లే, నా దగ్గర రూపాయలున్నయ్. మళ్ళీ కొనుక్కో కోడిని."

"వద్దులే సిట్టీ. నా కచ్చిరాలేదు. తవుడు బత్తా తెచ్చి మీ పాకలో పడేత్తాను."

"మీరు ధాన్యం మరెట్టించుకున్న తవుడు మాకెందుకు?"

"మీ నాన్నారు సాలుకి పదేను బత్తాల దాన్నెవు మా బాబుకి జీతాల కింద ఇత్తారు. అయ్యి ఆడించు కున్న సిట్టూ, తవుడూ, మీకే ఇయ్యాల. మేం వాడుకో కూడదు. గొడ్లున్న వోళ్ళయితే అడిగి తీసుకుంటారు."

"మీరు అమ్ముకుంటే మీకు నాలుగు డబ్బు లెక్కువొస్తాయి గదా! లేకపోతే 'మర' వాళ్ళకే ఆ చిట్టూ తవుడూ ఇచ్చేస్తే వాళ్ళు మీ ధాన్యం వూరికే మరబెడ్తారు గదా!"

"అలా కామందు లూరుకుంటారండీ!" అన్నది ముత్తి. కుటుంబంలో ఒక్కడు పాలేరుగా వున్నాడంటే వాడి కుటుంబం అంతా వాళ్ళకి సేవ చెయ్యాలి. వాళ్ళకి ఇంకోచోట కూలి డబ్బు లెక్కువ దొరికినా పోకూడదు. అందరూ కామందుల ఇళ్ళల్లోనే వూరికే పనిచెయ్యా లన్నంత నిరంకుశత్వం ఇంకా ఇంకా గ్రామసీమల్ని వదల్లేదు.

"ఏమిటీ దాన్నలా రాసుకు తిరుగుతావ్! నీకు చిరాకెయ్యదూ!" అంటుంది మామ్మ.

"చిన్నప్పట్నించీ దీనివి దరిద్రపుగొట్టు లక్షణాలే నండీ అత్తా! చిన్నప్పుడు ఇది దీన్నెత్తుకునే 'నరిసి' దగ్గరే అన్నం తింటానని మారాం చేసేది, మీకు జ్ఞాపకం వుందో లేదో కానీ" అంటుంది అమ్మ. నిజంగా నా లక్షణాలు దరిద్రపుగొట్టువే కాబోల్ను. నాకేం?

క్రితం సంవత్సరం నేనొచ్చేసరికి చెరువుకి ఏం దోషం తగిలిందో ఏమిటో? కలకల విరిసే తామర పూలన్నీ తలవాల్చేసాయ్. ఆకులన్నీ వాడిపోయాయ్. నాకు చెరువు అంతా నిర్జీవమైపోయినట్లు తోచింది. విచారంగా వుంది నాకు.

"తామర అంతా అల్లా చచ్చిపోయిందేమిటే ముత్యాలూ?"

"అరిగె బియ్యం కడిగారు కాబోల్ను ఎదవ సచ్చినోళ్ళు. తామరదుంపంతా సచ్చిపోనాది" అంది ముత్యాలు. దానికి ఎన్ని విషయాలు తెలుసు? దానికి తెలుసున్న విజ్ఞానంలో నాకెన్నోవంతు తెలుసు?

"అరిగె బియ్యం అంటే ఎల్లావుంటాయ్" అన్నాను.

"నీకేటి తెల్దే, అయి, నువ్వెప్పుడూ సూడినేదేటి? అయ్యి ఓదాన్నెవే. మినుముల్లా నల్లగా ఇంకాత్త పొడుగ్గా వుంటాయి. ఎంతనున్నగా వుంటయ్ అనుకున్నవ్ సిట్టీ! ఆ బత్తాలో సూది ఏత్తే అడుక్కిపోతది. ఓపాలి ఏటయిందో తెల్సా, మీవోళ్ళ పిల్లలు దాగుడుమూత లాడుకుంటున్నారు. అందులో ఓళ్ల పిల్లడు, అరిగెలు దాచుంచిన పొణకలో దిగాడు. మెల్లెంగ అడుక్కుజారిపోయి ఊపిరాడక సచ్చిపోనాడు."

"ఆ అన్నం తింటారు మీరు?"

"తినక! అయ్యి బియ్యం అవటానికి బోలెడు చాకిరి చెయాల! ముందరో సాలి దంపాల, మళ్ళీ తిరగట్లో ఏసి ఇసరాల."

నేను మళ్ళీ చెరువుకేసి చూసాను. చెరువు దిగులుగా వుంది. నాకు కళ్ళమ్మట నీళ్ళొచ్చాయి.

"సిట్టీ! నీదాస అంతా సెరువుమీదేవున్నది కామాలు. దంబిడీముఖం పెట్టావు, నువ్వు మళ్ళీ వచ్చేసరికి ఈ సెరువు నిండా మునుపటికన్న ఎక్కువ పూలుండేట్లు చేత్తాను. దిగులు పడమాక, పాలేన్ని పెద్ద సెరువులో బోలెడు దుంపలుంటయ్. నాలుగు తెచ్చిపడేత్తాను."

## డా॥ సినారె 'అందుకని'

అన్నయ్యా అని పిలిచినా
చిన్నవాణ్ణి గనుక గురువౌతావు;
పొరపాటున- / 'నన్నయ్యా' అని వినబడినా
కన్నవాణ్ణి గనుక కవి తరువౌతావు;
తెలుగు అక్షరాల సాక్ష్యమై
అడుగడుగుల సవ్వడివౌతావు
పొడిబాటల పరుగులాడే
ఆంధ్రామృత కావ్యమై కదులుతావు
నిర్ణయాద్భుత శ్రావ్యకంఠాన కవ్విస్తావు;

అందుకని- / జీవన సత్యాన్నాలపించడానికి
'ఈ' సమాజం చాలదా?
సమాధిలో సభాపర్వమెందుకు!
నిను అనువదిస్తే విశ్వంభరమై
అంతర్జాతీయత ఆవిష్కరిస్తుంది-
నిను అనుసరిస్తే కావ్యాంబరమై
ఆమోద సాహిత్యం సాక్షాత్కరిస్తుంది;

నీవిప్పుడు పాడుతున్నావా సినారె-
ఆలోచనావధుల్ని రాపాడుతూ,
నీవెప్పుడూ అక్షరాల తోటమాలివి
పూలు ఫలాల్ని పంచ
నిరీక్షించు కావ్యాల కోటదారివి.

-శ్రీ 'కాట్రగడ్డ'

## వారసత్వ అందలం కోసం...

వెయ్యాలంటే ఖిల్లాలోపాగా
నేర్వాలోయ్ కుడి, ఎడమల దగా.. దగా!
వాటంగా అందొచ్చిన వారసత్వ కుర్చీకి
మాయమైన మూడు కాళ్ళ ముందస్తు వెతుకులాట!
చేగువేరా రాతలకు స్థానమే లేదు
'త్యాగ' 'రాజ' భజనలే నిత్యకృత్యం
విత్తుగట్టిదైనా చెట్టు పెళుసు!
సందాలన్నీ దాటేందుకు – అద్దరిచేర్చేందుకు
అర్జంటుగా అవసరం – ఓ అభినవ గుహుడు
ఫ్రిట్జాఫ్ సలహాలు, సెజ్‌ల విలయాలు
రామనిలయాలు, రుధిక పతాకాలను దాటి
పిపీలిక ప్రభంజనాన్ని అడ్డి
మాయా'కరి'లు, మమల బెదుళ్ళను వీడి
చెదలు పట్టిన మౌనానికి
చెప్పాలిక తక్షణ స్వస్థి!

## నాలో నేను

కేవలం ఒక్క అక్షరం కోసం
నాలో నేను – నాతో నేను
ముక్కలై, ముక్కంటినై
మథనమై, మృణ్మమై, మృగ్యమై...
కేవలం ఓ ఆలోచన కోసం
బద్ధలై, పొరలు పొరలై
విచ్ఛిత్తై, ఓ నాటిన విత్తై!
ముల్లోకాలు ముమ్మారు చుట్టి
దుర్భిణినై, దుర్బలనై
వాయువునై, వేదననై!!
నాలో నేనే ఓ వాక్యం కోసం
ప్రసవించి, ప్రవహించి
ప్రవచించి, పవళించి!!
కేవలం ఓ అర్థం కోసం / నేనులో నేను
విభేదించి, వివరించి/విశ్లేషించి, విభాగించి.
ఓ స్థానం కోసం/నేనుతో నేను.. నాతో నేను
లాక్షించి, లోచించి
లయమై, హాయమై.. చివరకు మాయమై!
కేవలం ఓ మనిషి కోసం
నాకై నేను /శ్రమించి, క్రయించి
దానమై, దారినై.. దహనమై.. హననమై...

-పొన్నం శ్రీను

"ఏటేటి? ఈరురాలు బయిలెల్లిందెహ! తామర దుంపలు నువ్వు తెచ్చి ఏత్తావా? బతుకుదామనా సద్దామనా?" అన్నాడు సూరయ్య దానిమాటలు విన్నాడు కాబోలు.

"తామర పాతుతేనే పానం పోతదా!" అన్నది.

"వెనకా ముందూ ఎవరూలేనోరు, సచ్చే ముసలోళ్ళూ, ఎయ్యాల ఇత్తనం. ఎవురుపడితే ఆరు ఎయ్యకూడదు. వేత్తే మూడ్రోజులు తిరగకుండా సత్తారు. శాపం వున్నదట" అన్నాడు సూరయ్య.

"ప్చ్! ఇంక ఈ చెరువు ఇల్లా వుండాల్సిందే అన్నమాట!" నీళ్ళుకారిపోయాను.

"మా లావు సెప్పావులే! అదేందో నేనూ సూత్తాను. ఇయ్యాలసత్తే రేపటికి రెండు" అన్నది ముత్తి బింకంగా.

"నువ్వు సావటం ఖాయం. నిన్ను నమ్ముకోనున్న ఈ ముసలడ్ని ఏటిసేస్తావ్! సెర్లోపూలు ఆకులూ లేనంత మాత్రాన్ని వొచ్చిన లోటేటి! వోరన్న ముసలాడు దొరికితే అణ్ణట్టుకొని ఏయిద్దాం" అన్నాడు సూరయ్య. నాకు నిజంగా భయం వేసింది.

"ఒసే ముత్యాలూ నువ్వుగానీ తామర దుంప తెచ్చేవ్! తేబోకుస్మా! నాకు ఇప్పుడే ఎంతో బావుంది చెరువు. నిర్మలంగా వున్నయ్ నీళ్లు నాకు. నేను వొచ్చినప్పుడల్లా నువ్వు కనబడితేచాల్ను. చెరువు ఎల్లావున్నా ఫరవాలేదు."

"నేను ఏటవుతాను సిట్టీ! అదేదో ముసలాడిమాట సెప్పాడు. ముసలాళ్ళు సావక బతుకుతారా! ఆడేసినా సత్తాడు. ఏయకపోయినా సత్తాడు. ఏసి సచ్చాడు కనక ఇన్నాళ్లూ సెరువు కలకల్లాడినాది."

"నామీదొట్టే ముత్యాలూ! నువ్వు మాత్రం తేబోకు."

"నాకు మాత్రం పానాలమీది తీపి వొదులుద్దేటి సిట్టీ. కోకెంత బాగుందనుకున్నావ్! కట్టుకోని 'పెద్దింటమ్మ తిరణాలకు పోతే అంతా నావొంక చూసే వోరే!" మాట మార్చేసింది ముత్తి.

"నువ్వంత బాగుంటావు మరి. చూడరా?"

"మాటలు నేర్చావులే బాగ! మరి ఎల్లకాలం సదువేనేటి! పప్పన్నం ఎప్పుడు పెడతావు?"

"నేనొక్కదాన్నేనా పెట్టాల్సింది? మరి నువ్వెప్పుడు చేసుకుంటావు?"

"అక్కడికెల్లాక చేసుకుంటాను" ఆకాశంకేసి చేయి చూపించింది.

"ఛీ! ఏం మాటలు ముత్యాలూ! నాకెంత కష్టంగా వుందో తెల్సా" నాకు కళ్లమ్మట నీళ్లొచ్చాయి.

"ఎంతభిమానం నీకు నేనంటే సిట్టీ! మరేం చేయను. చెప్పు! మరి మా అయ్య నేను 'సీతయ్య'ని చేసుకుంటాని కొప్పనేదు. కులపోళ్లూరుకోరు అంటాడు. నాకయినా ఆడికయినా ఒకటే పానంగా వున్నోళ్ళం. ఎదవకులాలు! మమ్మల్నీ సంపుతాయి. సంపనీ ఏం జేత్తాం" నిర్లిప్తతగా అంది.

"మరి మీరూ మీరూ ఒకటి కాదా?"

"సీతయ్య వాళ్ళు కిరస్తానం పుచ్చేసుకున్నారు. మేం పుచ్చుకోలేదు. ఆడి చుట్టాలంతా బత్తీల్లో సదువుకోని వుద్దేగాలు సేత్తున్నారు. మరిగంటే సీతయ్య నన్ను కూడా సదివింతనన్నాడు. మరి మేమంటే ఆళ్ళిళ్ళల్లో ఇస్తరేయం. ఇంక ఎలా ముడెట్టుకోటం? ఇటు జూడబోతే మా అయ్య ముసిలాడు. ఒంటిగాడు. ఏం జేయాల్నో తోయకుండా వుంది." ముత్తి దిగులుగా అంది. అంత దిగులూ మనసులో దాచుకునే పైకి నిండుగా సముద్రాన్ని కలవబోతున్న నదీ ప్రవాహంలా జిల్లు జిల్లు మంటూ వుందన్న మాట ముత్యాలు.

వొచ్చేటప్పుడు మరీ మరీ చేతిలో చేయి వేసి చెప్పాను. తామర దుంప తేవొద్దని. తేనని చెప్తూనే కళ్ళమ్మట నీళ్లెట్టుకుంది ముత్యాలు.

○ ○ ○

కిటికీలోంచి చెరువు కేసి చూసాను. ఆ తామర పూవుల్లో, ఆకుల్లో, ఆ పూల రేకల చివర్లలో, ఆకుల మధ్యని, సన్నని ఈనెల్లో అంతటా, నాకు ముత్యాలే వేల రూపాల్లో కన్పించింది. తప్పకుండా తామరదుంప ముత్యాలే వేసి వుంటుంది. ఆ దోషం కొట్టి చచ్చిపోయింది. దాని రక్తబిందువుల్ని నింపుకున్నాయి కనుకనే ఆ పూలకి అంత అందమొచ్చింది.

"నేను నీకు కనబడతానే వున్నాను సిట్టీ! ఎందుకంత బెంగపడతావు?" అన్నట్టు ముత్యాలు గొంతు విన్పించింది. దాని ఋణం. ఈ చెరువుకి, ఇంత శాశ్వత సౌందర్యం చేకూర్చిన నా ముత్యాలు ఋణం ఎల్లా తీర్చుకుంటాను?

ముత్యాలూ! నీ స్నేహ సౌరభంతో నా మనస్సంతా నిండిపోయిందే? ఎల్లా మర్చిపోతాను? నా మనస్సులో కలిగే సందేహ తోరణాలు ఎవరు విప్పుతారు? నన్నర్థం చేసుకుని నా మాటలు నాకే విప్పిచెప్పే దేవతవు. నా మీద ఎందుకు ఆలిగావు? నీమీద బెంగతో కుమిలిపోతున్నానని చెప్పితే వీళ్లంతా నన్ను పిచ్చిదాని క్రింద జమ చేస్తారుకదా! నిజంగా పిచ్చిదాన్నయితే ఎంత బాగుణ్ను! తెలిసి తెలియని అవస్థకన్న,

# ముందు చూపు

**మూ**డేళ్ళ క్రితం నా మనమడు
'తాతా' అని పిలవగానే
నిజంగా ముసలి ఛాయలు వచ్చాయా?
ప్రశ్నించుకునే వాడిని నాలో నేను!
ప్రతి జూలై నాలుగున బ్రతుకు నిచ్చెనలో
ఒక్కొక్క మెట్టు పైకెక్కుతున్నాను!
పట్టువదలకుండా నిబ్బరంతో
ఇప్పటివరకు నిలువగలిగాను! కానీ?
నా మనసులోని ఆలోచనలని
అదుపులో వుంచలేకపోతున్నాను
అలజడితో సతమతమై పోతుంటే
ఈ మార్పులను తీరిగ్గా గమనిద్దామని
పరిశోధనల పుస్తకం తెరవగానే
నెలల వయసున్న నా మనవరాలు
నేల మీద పాకుతూ వచ్చి 'తాతా' అంటూ
నవ్వుతూ చేతులందించింది నాకు
ఎత్తుకొని ఆటలాడించాలని
రక్తసంబంధాన్ని గుర్తుచేసింది.
ఇప్పుడనిపిస్తుంది నాలో నాకు
హఠాత్తుగా పదేళ్ళు పెద్దయిపోయినట్టు!
బ్రతుకు నిచ్చెనపై నిలబడి
యాభైయేడో మెట్టు నుంచి
క్రిందకు చూస్తే కళ్ళు తిరిగాయి
పాత జ్ఞాపకాల వెక్కిరింపులతో!
పైకి వెడదామంటే నీరసం!
పట్టువీడితే పట్టుకునే వారెవరు?
కుటుంబంలో అంతా బిజీ బిజీగా
ఎవరి పనుల్లో వాళ్ళుంటారు!
దేవుడిపై భారం వేసి సహాయం కోరినా
దివి నుంచి భువికి దిగలేని దేవుడు
ఏడడుగుల బంధాన్ని అక్కడే బిగించి
ఒకరికొకరు జీవితాంతం తోడుండాలని
ముందు చూపుతోనే దీవించాడట
ఇందుకోసమే అనుకుంటాను.

-పులిజాల రవీందర్‌రావు

## ఏది?

కడుపు నిండిన వారి గళం నింపుటె గాని
పేదసాదలను దరిజేర్చే పెన్నిదేది?
నరరూప రాక్షస నాయకకృతేగాని
దీన రక్షక సుధా దీప్తి ఏది?
నోట్ల కట్టలు జూపి సీట్లు గెల్చుటె గాని
సద్గుణ వర్తియౌ సదయుడేడి?
ద్వేషమే స్వరమై రాజ్యమేలుడెగాని
ప్రేమానుబంధాల చరణమేది?
అహంభావమంతా, అనురాగాన్ని చెరుపుటెగాని
సహకార సంబంధ పల్లవేది?
ఎవరి గమనం వారికిష్టమవ్వుటెగాని
దేశ దుస్థితిని గాంచే సహృదయులేరి
బతుకుల మార్చు ఆలోచనల జ్వాలలేవి
ఆశయాల వైపు సాగు పయనమేది
శ్రమలో దైవాన్ని చూసే భవితలేవి?

## మనసులోని ప్రేమ

మారుతున్న ప్రపంచంలో టీవీకి
మెదడునప్పగించాము
బుల్లితెర బతుకును పూజ్యంగా, ప్రబోధంగా
కట్టునుండి బొట్టువరకు/కుతంత్రాలు ఉచితంగా
సంస్కారం పేలవంగా/ఇంటింటి సంగతులు
బుగ్మతలుగా భావించి బ్రతుకీడ్చగ
ఆశల శిఖరాలు ఎదలో
ఎదిగి నింగికెగరంగా
నివసించే స్వర్గమంటి ఇల్లు
నరక నిలయంగా తోచె నేడు
తళతళలాడే దుస్తులు/మిళమిళలాడే మెరుగులు
సంపాదనె లక్ష్యమని/ముసలి ముత్క అడ్డమని
సంసారపు కుంపటిని మండించే
కథలు నేడు, వ్యథలను చూపించిన
ఉత్తమ కథలుగా మిగలంగ
పూరిగుడిసె ఒక్కటైన కానరాని
సీరియల్లు సీరియస్‌గా వీక్షించే కనులు నేడు
పెద్దవారు పడే పాట్లు ఇంట ఇపుడు కానలేవు
సంసారపు కష్టమిపుడు కదలిని తలపించగా
అనురాగం, ఆప్యాయత/చట్టాల్లో బందీ అయి
శిక్షల మార్గాలే సులువయ్యి/మెదడు బరువు తగ్గింది
మనసులో ప్రేమే కరువయ్యింది

**-సిరిసిల్లా గఫూర్ శిక్షక్**

అయోమయావస్థ వేల రెట్లు మెరుగుకదూ!"

"ఇంకా అల్లానే కూర్చున్నావుటే ఆ కిటికీలో! లేచి స్నానం చెయ్యి వేగం! అంతా నువ్వొచ్చావని చూడటాని కొస్తే అల్లా చీకిరి గంపలా కూర్చుంటావేమిటే! ఖర్మ" అన్నది మామ్మ.

"అది చిన్నప్పణ్నించీ అంతేనండీ, అత్తా! వొట్టి మట్టిముద్ద. ఏమిటో ఆలోచిస్తోంటుంది ఎప్పుడూనూ" అని వంతపాడింది అమ్మ.

"ఇప్పుడొచ్చిందో, లేదో అప్పుడే సాధింపు మొదలెట్టారా దాన్ని" నాన్నగారి కంఠం విన్పించేసరికి నా ప్రాణం లేచొచ్చినట్లు అన్పించింది.

"నాన్నగారూ! మనూరి చెరువు పేరేమిటండీ!" అన్నాను.

"పేరేమీలేదమ్మా, ఏం?"

"ముత్యాల చెరువు అందామా దాన్ని!"

"అనుకోమ్మా! దానికేం?"

"అవును, ముత్యాలచెరువు అంటే బాగుంటుంది. నా ముత్యాలు, తన జ్ఞాపకం కోసరం, చెరువుంతా తామరలతో నింపిపోయింది. అందుకనే తామరాకుల మీద నిలిచిన నీటి బిందువులు ముత్యాలల్లే మెరుస్తాయి."

"అల్లా అయితే చిన్న బోర్డుమీద వ్రాసి అక్కడ పెట్టిద్దామా నాన్నగారూ?"

"నీకు నువ్వనుకోవమ్మా చాల్సు. ఎవరైనా వింటే నవ్విపోగల్రు"

నవ్వుతారట. ఎందుకు నవ్వుతారు? నాకు కోపం వచ్చింది.

"నాకు నేనే అనుకుంటాలేండి నాన్నగారూ. ఏ మంత్రిగార్నో పిలిచి మీటింగు చేయించి, నామకర ణోత్సవం చేయించగలిగే స్తోమత నాకు లేదుగా."

"ఏమిటే, వెధవ సొద. ఇదేం తిరుపతా, శ్రీరంగమా? ఇంతోటి పుష్కరిణికీ పేరు కావాలిట పేరు. పట్టుమని పది కొంపలు లేవు. చదవేస్తే వున్న మతి పోతోంది దీనికి. అందుకే మహాప్రభూ దీన్నెవరికో దారినపోయే దానయ్యకిచ్చి మూడుముళ్ళూ పడేయించండి అని మొత్తుకుంటుంటే వింటున్నారా?" అంటూ అమ్మ మొదలెట్టింది.

నాకు మటుకు తిరుపతీ, శ్రీరంగం పుష్కరిణిల కన్న నా ముత్యాల కోనేరే ఎక్కువ అని వాళ్ళకి చెప్పినా తెలీదు. చెప్తే అర్థంచేసుకునే వ్యక్తి, నక్షత్రాలకి జతగా ఆకాశం మీదుంది. ■